# సాక్షి అనకాపల్లి

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025






## హోరెత్తిన కలెక్టరేట్

కలెక్టరేట్ సోమవారం నిరసనలతో హోరెత్తిం ది. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీదారులు నినదించారు. 8లో

**ఉష్ణోగ్రతలు**

సోమవారం

| | | గరిష్టం/కనిష్టం |
|---|---|---|
| అనకాపల్లి | : | 36.3/25.0 |
| చోడవరం | : | 35.0/26.0 |

## నిలిచిపోయిన 'ఆరోగ్యశ్రీ' సేవలు



కూటమి ప్రభుత్వం ఆరోగ్య శ్రీ నిధులు సుమారు రూ.3.500 కోట్లు బకాయిలు పెట్టడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్య సేవలను నిలిపివేశాయి. 8లో

## న్యూస్‌రీల్

### జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా చిన్నంశెట్టి రాజు

- పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య బదిలీ

**విశాఖ లీగల్ :** విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా మచిలీపట్నం ఒకటో అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు నియమితులయ్యారు. ప్రస్తుతం విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఆలపాటి గిరిధర్.. నగరంలోని వ్యాట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు అదనపు జిల్లా జడ్జిలకు బదిలీ జరిగింది. విశాఖ పదో అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయమూర్తిగా వెళుతున్నారు. అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ విశాఖ జిల్లా పదో అదనపు జిల్లా జడ్జిగా బదిలీపై వస్తున్నారు. నగరంలోని వ్యాట్ ట్రిబునల్ చైర్మన్ జి.గోపి మచిలీపట్నం ఒకటో అదనపు జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. రెండో అదనపు జిల్లా కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి వి.వాణి ఏలూరు పోక్సో కోర్టు న్యాయమూర్తిగా బదిలీపై వెళుతున్నారు. విశాఖలోని 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ కాకినాడలోని ఆరో అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీపై వెళుతున్నారు. నగరంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది కాకినాడ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఏలూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.మంగాకుమారి వస్తున్నారు.

### జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణ బదిలీ



**డాబాగార్డెన్స్ (విశాఖ):** జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ బదిలీ అయ్యారు. ఇక్కడి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా డిప్యూటేషన్‌పై నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది పాటు డిప్యూటేషన్‌పై టీటీడీ డీఈవోగా విధులు నిర్వహించనున్నారు. జీవీఎంసీలో పబ్లిక్ హెల్త్, రెవెన్యూ విభాగానికి సంబంధించి అదనపు కమిషనర్‌గా ఆయన విధులు నిర్వహించారు.

### తాండవ గేట్లకు మరమ్మతులు



తాండవ ఎడమ కాలువ నీరు కోటనందూరు మండలం వెళ్లే డ్రాప్ దగ్గర గేట్ల మరమ్మతులు

**నాతవరం :** తాండవ రిజర్వాయరు ప్రధాన గేట్లు మరమ్మతులతో పాటు పిల్ల కాలువల గేట్లు మరమ్మతు పనులు చేపడుతున్నామని ప్రాజెక్టు జేఈ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం మెకానికల్ జేఈ ఉమాశ్రీతో కలిసి గేట్ల మరమ్మతు పనులకు సంబంధించి మెటీరియల్ క్రేన్ ఏర్పాటును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జేఈ మాట్లాడుతూ తాండవ ప్రధాన గేట్ల లీకేజీ కారణంగా ప్రాజెక్టులో నీరంతా వృథాగా బయటకు పోయేదన్నారు. ప్రధాన గేట్లు 2, 19 కిలోమీటర్ల వద్ద గేటు మరమ్మతులకు ప్రభుత్వం రూ.19.70 లక్షలు మంజూరు చేసిందన్నారు. కొంతవరకు మరమ్మతులు చేపట్టడంతో లీకేజీ కొంత అరికట్టగలిగామన్నారు. పూర్తి స్థాయిలో ప్రాజెక్టు ప్రధాన గేట్ల మరమ్మతులు చేసేందుకు మెటీరియల్ రావలసి ఉందన్నారు. ప్రధాన గేట్ల మరమ్మతులు మెకానికల్ డీఈ, జేఈ ఆధ్వర్యంలోనూ, తాండవ ప్రధాన కాలువలు అభివృద్ధి పనులు, పూడికతీత పనులు తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ పర్యవేక్షణలో చేపడుతున్నామని వివరించారు.

### పయనీర్ పరిశ్రమ కార్మికుల ఆందోళన



గేటు బయట కూర్చొని ఆందోళన చేస్తున్న పయనీర్ పరిశ్రమ కార్మికులు

**అచ్యుతాపురం రూరల్ :** కార్మికుల శ్రమను పయనీర్ పరిశ్రమ దోపిడీ చేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆరోపించారు. అధిస్థాన్(బ్రాండిక్స్)లో ఉన్న పయనీర్ పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం మధ్యాహ్నం ఏ, బీ షిఫ్ట్ కార్మికులు గేటు బయట ఆందోళన చేపట్టారు. వారికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పయనీర్ పరిశ్రమలో కార్మికులకు ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్ వేయడం లేదన్నారు. అతి తక్కువ బోనస్ ఇచ్చి నైట్ డ్యూటీలు చేయిస్తూ కార్మికులను మోసం చేస్తున్నారన్నారు. యాజమాన్యం స్పందించి వెంటనే కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.

- పారాహుషార్

# ఎండల్లో మంటలు



- వేసవిలో అగ్ని ప్రమాదాలకు అవకాశం
- అప్రమత్తతతో భారీ నష్టాలకు చెక్
- అగ్నిమాపక కేంద్రాల్లో పీడిస్తున్న సిబ్బంది కొరత
- జిల్లాలో అందుబాటులో 8 అగ్నిమాపక కేంద్రాలు



జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు - 8

2023-24లో ఫైర్‌కాల్స్ - 560

ప్రమాదాల్లో ఆస్తి నష్టం రూ.327.42 కోట్లు

కాపాడిన ఆస్తి రూ.205.66 కోట్లు

సాక్షి, అనకాపల్లి :

ఎండాకాలంలో భానుడు భగ్గుమంటున్నాడు. ఈ ఏడాది మార్చి నెల ప్రారంభం నుంచే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతన్నాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది అధికంగానే ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణ శాస్త్రవేత్తలు ఇప్పటికే హెచ్చరించారు. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో అగ్నిప్రమాదాలు సంభవించడానికి అవకాశాలెక్కువగా ఉంటాయి. అగ్గిలా మండే ఎండలకు తోడు ఫైర్ యాక్సిడెంట్లు సంభవిస్తే ఆస్తి, ప్రాణనష్టాలు సంభవించే పరిస్థితులు ఎదురవుతాయి. ముఖ్యంగా మార్చి నుంచి జూన్ వరకు నాలుగు నెలల వరకూ ప్రజలతో పాటు అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మేరకు ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. జిల్లాలోని 8 అగ్ని మాపక కేంద్రాలు ఉన్నప్పటికీ తీవ్రమైన ప్రమాదాలు సంభవించినప్పుడు నిమిషాల వ్యవధిలోనే జరగాల్సిన నష్టం అంతా జరిగిపోతోంది.

**జిల్లాలో మొత్తం 6 ఫైర్ స్టేషన్‌ల్లో 75 మంది అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీటితో పాటుగా మరో రెండు అవుట్‌సోర్సింగ్ ఫైర్‌స్టేషన్లలో 25 మంది వరకూ సిబ్బంది ఉన్నారు.**





ఫార్మా కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఏవిధంగా కాపాడుకోవాలనే దానిపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ పోలీసులు

**అవగాహన కోసమే వారోత్సవాలు..**

అగ్ని ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రభుత్వం ఏటా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ వారోత్సవాల్లో భాగంగా, విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బందికి నివాళులర్పించడం, బస్టాండ్, మార్కెట్లు, సినిమా థియేటర్లు, మురికివాడల్లో అగ్ని మాపక నియంత్రణ పరికరాల వినియోగం, అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన, ఎల్‌పీజీ స్టోరేజీ, పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బందికి అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలా తమని తాము కాపాడుకోవాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు.

**పారిశ్రామిక ప్రాంతంలో మరింత అప్రమత్తం..**

జిల్లాలో పారిశ్రామిక ప్రాంతమైన పరవాడ, రాంబిల్లి, అచ్యుతాపురం, కశింకోట మండల పరిధిలో ఒక వైపు పరిశ్రమలు, మరో వైపు ప్రజలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా 560 అగ్నిప్రమాదాలు సంభవించాయి. వీటిలో 2 అత్యంత ప్రమాదకరమైనవి (రూ.10 లక్షలకు పైగా నష్టం సంభవించిన ప్రమాదాలు) కాగా, 40 మీడియం ఫైర్ కాల్స్ (రూ.2 లక్షల నుంచి రూ.10లక్షలలోపు నష్టం), 489 చిన్నపాటి అగ్ని ప్రమాదాలు సంభవించాయి. జిల్లా వ్యాప్తంగా జరిగిన 560 అగ్ని ప్రమాదాల్లో రూ.205 కోట్ల వరకు ఆస్తి నష్టం సంభవించగా, రూ.327.42 కోట్ల ఆస్తిని అగ్నిమాపక సిబ్బంది కాపాడగలిగారు. ఈ ప్రమాదాల్లో 32 మంది ప్రాణాలు కోల్పోగా, 19 మందిని అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలకు తెగించి కాపాడగలిగారు. అలాగే ఈ ప్రమాదాల్లో 20 పశువులు చనిపోగా, ఒక దాన్ని సిబ్బంది కాపాడారు. రెస్క్యూ చేస్తుండగా 18 మంది చనిపోగా..ముగ్గురిని బతికించగలిగారు.

| జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు | |
|---|---|
| అనకాపల్లి | 08924-222299 |
| యలమంచిలి | 08924-222299 |
| నర్సీపట్నం | 08924-231101 |
| మాడుగుల | 08924-235101 |
| చోడవరం | 08934-345199 |
| సబ్బవరం | 08924-231101 |
| **అవుట్ సోర్సింగ్ ఫైర్ స్టేషన్లు..** | |
| నక్కపల్లి | 08924-231101 |
| రావికమతం | 08932-235101 |

### అవగాహనకు మాక్‌డ్రిల్



జిల్లాలో సెజ్ ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో.. సేఫ్టీ ఆడిట్‌లో భాగంగా ప్రతి నెలా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తాం. ఏ ప్రాంతంలో అయినా అగ్ని ప్రమాదం జరిగిన తక్షణమే ఆయా పరిధిలో ఉన్న ఫైర్‌స్టేషన్లకు సమాచారం ఇవ్వాలి. వేసవిలో ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాల పట్ల అత్యంత జాగ్రత్తంగా ఉండాలి. ఫార్మా కంపెనీలతో కలిసి మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నాం. ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ పేరిట శిక్షణ కల్పిస్తున్నాం. ఇవి కాకుండా జిల్లాలో వేసవిలో ఎక్కువగా తోటలు తగలబడినట్టు ఫైర్ కాల్స్ వస్తున్నాయి. ఎటువంటి అగ్నిప్రమాదం సంభవించినా 101 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి.

– వెంకట రమణ, జిల్లా ఫైర్ అధికారి

**ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు..**

- గ్యాస్ స్టౌను సిలిండర్ కన్నా ఎత్తులో ఉంచి వాడాలి
- అదనపు సిలిండర్‌ను వాడుతున్న సిలిండర్‌కు దూరంగా ఉంచాలి
- కిరోసిన్, డీజిల్, పెట్రోలు సిలిండర్‌కు దూరంగా ఉంచాలి.
- చిన్నారులకు అగ్గిపెట్టెలు, లైటర్లు అందుబాటులో ఉంచరాదు.
- వంట పూర్తయిన వెంటనే గ్యాస్ రెగ్యులేటర్ ఆపివేయాలి
- ఐఎస్ఐ మార్కు ఉన్న ఎల్‌పీజీ సురక్ష ట్యూబులనే వాడాలి.
- గ్యాస్ లీక్ అవుతున్న అనుమానం వస్తే కిటికీలు, తలుపులు వెంటనే తెరవాలి
- ఎలక్ట్రికల్ స్విచ్ ఆన్ అఫ్ చేయకూడదు
- ఇళ్లు వదిలి దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ మెయిన్ ఆఫ్ చేయాలి
- విద్యుత్ పరికరాలకు నిప్పు అంటుకుంటే మెయిన్ ఆఫ్ చేసి పొడి ఇసుక లేదా డ్రై కెమికల్ పౌడర్ నిప్పు మీద చల్లాలి
- కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పి పారేయాలి.
- దుస్తులకు నిప్పు అంటుకుంటే పరిగెత్తరాదు. నేలపై దొర్లాలి లేదా దుప్పటి చుట్టుకోవాలి
- కాలిన శరీర భాగాల మీద చల్లని నీరు పోయాలి.
- గడ్డివాములను నివాస గృహాలకు తప్పనిసరిగా దూరంలో వేసుకోవాలి.
- కర్మాగారాల్లో కార్మికులు పనిచేసే స్థలాల్లో కనీసం రెండు ఫైర్ ఎగ్జిట్‌లు ఏర్పాటు చేయాలి

# ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

- అప్పుల బాధతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



రమణ బాబు (ఫైల్)

**నక్కపల్లి :** నక్కపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అప్పుల బాధతో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం తుని రైల్వే పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కపల్లికి చెందిన కొల్నాటి రమణబాబు(33) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల నుంచి ఇంటి వద్ద నుంచే విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతనికి ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు చేసే అలవాటు ఉంది. ఈ బెట్టింగ్‌ల కారణంగా తను సంపాదించిన జీతాన్ని ఇంట్లో కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు పాల్పడే వాడు. ఈ బెట్టింగ్‌ల వల్ల సంపాదించిన సొమ్మంతా పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. చేసిన అప్పులు తీర్చాలని ఒత్తిడి రావడంతో ఆదివారం నర్సీపట్నం, రేగుపాలెం డౌన్‌లైన్ ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న రైల్వేపోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అతని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నక్కపల్లిలో ఉండే ఇతని కుటుంబం కొన్నాళ్ల క్రితమే ఉద్దండపురం గ్రామానికి వలస వెళ్లి అక్కడ కాఫీ హోటల్ నిర్వహిస్తూ జీవిస్తున్నట్టు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి శ్రీనివాస రావు తెలిపారు.

# గిగ్ వర్కర్లకు ఈశ్రమ్ నమోదు

**సీతంపేట :** గిగ్ వర్కర్లు, జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్లు ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావు అన్నారు. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ వరకు పది రోజుల పాటు ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరి బాయ్స్, కొరియర్ బాయ్స్, లాజిస్టిక్ డెలివరీ వర్కర్స్, జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్స్ ఈశ్రమ్ పోర్టల్‌లో https:// eshram. gov. in/ indexmain న మోదు చేసుకోవాలని కోరారు.

16 నుంచి 59 ఏళ్లలోపు వారు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని రంగాల్లో పనిచేస్తున్న వారు అర్హులని తెలిపారు. ఈశ్రమ్‌లో నమోదు వల్ల కుటుంబానికి రూ.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం, సాంఘిక, ఆర్థిక భద్రత కల్పించబడతాయన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్లు ఎస్.గోవింద్, ఆర్.రమాదేవి పాల్గొన్నారు.

# దేవాలయాల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

- నైవేద్యం, ప్రసాదాల తయారీకి వినియోగం
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

**తుమ్మపాల :** దేవాలయాలలో నైవేద్యం, ప్రసాదాల తయారీకి ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఉత్పత్తులను వినియోగించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో దేవదాయశాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. దేవాలయాలలో వినియోగిస్తున్న ఆహార వస్తువులు వివరాలు, వాటి సేకరణ విధానాలు, ప్రస్తుతం జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విధానం, పండిస్తున్న పంటలు, వాటి లభ్యత వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, రైతులు పండించే సరుకులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. ఈ విధానం అమలు తొలిదశలో దేవాలయాలలో నైవేద్యం, ప్రసాదాలకు కావలసిన సరుకులను ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు మాత్రమే కొనుగోలు చేయాలని, అందుకుగాను అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని దేవదాయశాఖ అధికారులకు ఆదేశించారు. ఏ దేవాలయానికి ఏ వ్యవసాయ రైతు సంఘం ద్వారా సరుకులు సరఫరా చేయాలనే విషయం మ్యాపింగ్ చేసి, ఆ విధంగా సరుకులు సరఫరా చేయాలన్నారు. నూరుశాతం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను మాత్రమే సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, పర్యవేక్షణ చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. భవిష్యత్తులో దేవాలయాలకు కావలసిన సరుకులన్నింటిని సరఫరా చేయుటకు వ్యవసాయ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, ప్రకృతి సాగును పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు అధికారి సిహెచ్.లచ్చన్న, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, జిల్లా దేవదాయశాఖ అధికారి కె.ఎల్.సుధారాణి, జిల్లాలో దేవాలయాల ఎగ్జిక్యూటివ్ అధికారులు పాల్గొన్నారు.

**100 శాతం క్లోరినేషన్ చేపట్టాలి**

వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీరు సమస్య లేకుండా చూడాలని, గ్రామ పంచాయతీల్లో గల వాటర్ ట్యాంకుల్లో 100 శాతం క్లోరినేషన్ చేపట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఎంపీడీవోలను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపడుతున్న సర్వేలు, పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంఈడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయత్‌రాజ్, గృహనిర్మాణ శాఖల అధికారులతో మాట్లాడారు. సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న సర్వేలన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాలను పూర్తిచేయాలని, ఉపాధి కూలీలకు మంచినీరు అందుబాటులో ఉండేలా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గిరి శిఖర గ్రామాల్లో మంచినీటి వసతి కల్పించాలని, గోకులం షెడ్లను వేగంగా పూర్తి చేయాలని, ఇంకా అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు మంజూరైన అదనపు సహాయం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 11న జ్యోతిరావు పులే జయంతిని పురస్కరించుకుని బీసీ కార్పొరేషన్ ద్వారా 400 యూనిట్లను మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేయాలని బీసీ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఏఎస్‌ఎ. రామస్వామి, డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ కె.నాగలక్ష్మి, జిల్లా వెనుకబడిన తరగతుల కార్యనిర్వహణ డైరెక్టర్ పెంటోజీరావు పాల్గొన్నారు.

# మా ఆకలి కేకలు వినిపించవా..!

- పంచాయతీ కార్మికుల నిరసన
- బుచ్చెయ్యపేటలో ఖాళీ ప్లేట్లతో ఆందోళన




బుచ్చెయ్యపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ ప్లేటులతో ఆందోళనకు దిగిన స్వీపర్లు

**బుచ్చెయ్యపేట :** ఆకలితో అలమటిస్తున్నాం జీతాలు అందించి ఆదుకోవాలంటూ మండల స్వీపర్లు(పంచాయతీ కార్మికులు) ఖాళీ ప్లేట్లతో ఆందోళనకు దిగారు. సోమవారం మండల కేంద్రం బుచ్చెయ్యపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట 35 పంచాయితీ గ్రామాలకు చెందిన స్వీపర్లు ఖాళీ ప్లేట్లు పట్టుకుని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం జీతాలు అందించి ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. గ్రామాల్లో ఉన్న కాలువల్లో మురుగు పూడిక పోయి కంపుకొడుతున్న చెత్తను నెత్తిన పెట్టుకుని రోజూ తీవ్ర దుర్గంధం నడుమ పారిశుధ్య పనులు చేస్తున్నాం.. తెల్లవారుజాము నుంచి విధులు నిర్వహిస్తూ గ్రామాల్లో ఉన్న చెత్తాచెదారంతో పాటు తుప్పలు,డొంకలు తొలగించి సంపూర్ణ పారిశుధ్యానికి కృషి చేస్తున్నాం... ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా ట్యాంకులు కడిగి తాగునీరు అందిస్తున్న మమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ పారిశుధ్య కార్మికులు ఆవేదన చెందారు. మండలంలో సుమారు 300 మంది వరకు పని చేస్తున్నామని ఒక్కొక్కరికీ ఐదు నుండి 13 నెలలు జీతాలు అందాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబంతో అర్ధాకలితో అలమటిస్తున్నామని అన్నారు. వారి ఆందోళనకు సీఐటీయూ మండల నాయకులు పినపాత్రుని సాంబశివరావు, ఎస్.వి. నాయుడు, జిల్లా కోశాధికారి వి.శ్రీనివాసరావు మద్దతుగా నిలిచారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికల ముందు ప్రజల కోసం పలు ప్రగల్భాలు పలికేవారని తన సొంత శాఖలో పని చేస్తున్న పంచాయతీ కార్మికుల ఆకలి కేకలు ఆయనకు తెలియదా..? అంటూ సీఐటీయు నాయకులు ప్రశ్నించారు. వెంటనే పంచాయతీల్లో టెండర్ విధానం రద్దు చేసి ప్రతి పారిశుధ్య కార్మికుడికి నెలకు రూ.10 వేలు జీతం అందించాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు అందించాలని, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, యూనిఫాం, గ్లౌజులు అందించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో విజయలక్ష్మికి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. కార్మిక సంఘ నాయకులు ఏసు, నూకరాజు, అమ్మాజీ, శ్రీను,మరియమ్మ, కొండబాబు, ప్రసాద్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు మహాసభల లోగో ఆవిష్కరణ



తెలుగు మహా సభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విశాఖ స్పోర్ట్స్:** 3వ ప్రపంచ తెలుగు మహాసభల లోగోను శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాష, యాస భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మాతృభాషలో మాట్లాడాలన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రమేవ జయతే అంటూ నినదిస్తున్నామన్నారు. ఆంధ్రలో ఇప్పటికే రెండు సభలు నిర్వహించామన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న పి.రామచంద్రరాజు మాట్లాడుతూ 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో అమరావతి గుంటూరు హైవే శ్రీ సత్య సాయి స్పిరిచ్యువల్ సిటీ గ్రౌండ్స్‌లో ఈ సభ జరుగుతుందన్నారు. భాషాభిమానులే అన్ని బాధ్యతలు తీసుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రులతో సహా పలువురు గౌరవనీయుల్ని ఆహ్వానిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వై.రామారావు మాట్లాడుతూ గతేడాది 20 బ్లడ్‌బాంక్‌ల ద్వారా లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించి అందచేశామన్నారు. ఆరు బ్లడ్‌బాంక్‌ల ద్వారా తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగానే రక్తం అందించామన్నారు.

ఈ సందర్భంగా రక్తదానం చేయండంటూ ప్రచార రెడ్‌క్రాస్ సొసైటీ గోడపత్రికను స్పీకర్ అయ్యన్నపాత్రుడు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ యువ వలంటీర్లు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జేఈఈ విద్యార్థులకు మరో అవకాశం ఇవ్వాలి

- పవన్ పర్యటనతో పరీక్ష రాసే అవకాశం కోల్పోయిన విద్యార్థులు
- ట్రాఫిక్‌జామ్ కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఏఐఎస్ఎఫ్, ఏఐడీఎస్‌వో సంఘాల డిమాండ్

**పెందుర్తి:** ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన కారణంగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయిన జేఈఈ మెయిన్ సెషన్-2 అభ్యర్థులకు మరో అవకాశం కల్పించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి యు.నాగరాజు, ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో) సంఘం జిల్లా అధ్యక్షుడు కె.అభిలాస్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఓ వైపు ఉప ముఖ్యమంత్రి వస్తున్నారని తెలిసి, మరోవైపు అదే మార్గంలో జేఈఈ పరీక్షలు జరుగుతున్నాయని సమాచారం ఉండి కూడా ట్రాఫిక్‌పై పోలీసులు నియంత్రణ కోల్పోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తీరు కారణంగా 23 మంది విద్యార్థుల జీవితం అంధకారంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి పరీక్ష రాసే అవకాశం కోల్పోయిన విద్యార్థులకు తిరిగి పరీక్ష పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరగకపోతే వారి తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

### 24 లీటర్ల సారా స్వాధీనం



నాటు సారాను స్వాధీనం చేసుకున్న సీఐ శ్రీనివాసరావు

**పాయకరావుపేట:** మండలంలోని గుంటపల్లి, పెదరాంభద్రపురం, అరట్లకోట గ్రామాల్లో దాడులు నిర్వహించి 24 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఇద్దరు పురుషులు, ఒక మహిళను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. వారిని యలమంచిలి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. అదే విధంగా గతంలో సారాతో పట్టుబడిన 8 మందిని నక్కపల్లి మండల తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామన్నారు.

# నిరసనలతో హోరెత్తిన కలెక్టరేట్

- ఫిర్యాదులపై స్పందన ఎక్కడ?
- గేటు బయటే దివ్యాంగులు
- అర్జీదారుడికి మాత్రమే లోపలికి అనుమతి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



భూసమస్య పరిష్కరించని అధికారుల తీరుపై నిరసన తెలుపుతున్న కూటమి నాయకుడు బుద్ధ శ్రీనివాసరావు



గేటు బయటే దివ్యాంగుడి అర్జీని స్వీకరిస్తున్న ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి

**తుమ్మపాల:** కలెక్టరేట్ సోమవారం నిరసనలతో హోరెత్తింది. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీదారులు నినదించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం అర్జీదారులతో కిటకిటలాడింది. పలు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ గేటు బయట పలువురు నిరసనలు తెలిపారు. అధికారుల తీరుకు నిరసనగా పలువురు కూటమి పార్టీల నాయకులు కూడా నేరుగా ఆందోళన చేయడం గమనార్హం.

**దివ్యాంగులకు తప్పని నిరీక్షణ**

జిల్లాలోని దివ్యాంగులు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ లోపలికి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. జిల్లాలో దివ్యాంగులు కార్యాలయం లేక ఎదురవుతున్న ఇబ్బందులను అనేక రూపాల్లో చేసిన నిరసనలకు నేటికీ ఫలితం లేకుండా పోయింది. వారానికి ఒక్క రోజు చేపట్టే పీజీఆర్ఎస్‌లో తమ మొరను తెలిపేందుకు వ్యయ ప్రయాసలతో వస్తే వారిని కలెక్టరేట్ బయటే సిబ్బంది అడ్డుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. గేటు దాటి లోపలికి వెళ్లే అవకాశం లేక వారి వద్దకు వచ్చే అధికారుల రాక కోసం గంటల పాటు నిరీక్షిస్తున్నారు. తీరా వారి వద్దకు వచ్చిన అధికారులు సమస్య తమ పరిధి కాదంటూ అర్జీలు తీసుకుని చేతులు దులుపుకోవడంతో తమ సమస్యలకు పరిష్కారం చూపే నాథులే కరువయ్యారంటూ దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**లోపలికి అనుమతి నిరాకరణ**

సుదూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు చేరుకుని తమ గోడును జిల్లా అధికారులకు విన్నవించుకుందామని కలిసికట్టుగా వస్తున్న వారిని లోపలికి అనుమతించడం లేదు. వృద్ధ దంపతులు, కుటుంబ సభ్యుల తోడుతో వచ్చే నిరక్షరాస్యులు, నడవగలిగే వికలాంగుల్లో ఒక్కరిని మాత్రమే కలెక్టరేట్ లోపలికి అనుమతిస్తూ.. వారికి తోడుగా వచ్చిన వారిని సిబ్బంది బయటకు నెట్టేస్తున్నారు. దీంతో పాటు అధికారులకు అర్జీలిచ్చే క్రమంలో ఫొటోలు తీసుకునే పరిస్థితి కూడా లేకుండాపోయింది. సిబ్బందికి చెప్పి ఫొటోలు తీయకుండా చూస్తున్నారు.

**సకాలంలో అర్జీలకు పరిష్కారం : కలెక్టర్**

తుమ్మపాల: పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమెతో పాటు జేసీ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీల గురించి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం కాని అర్జీల గురించి కారణాలను వివరంగా దరఖాస్తుదారుడికి తెలియజేస్తే అర్జీలు రీఓపెన్ కాకుండా నివారించవచ్చన్నారు. మొత్తం 394 అర్జీలు నమోదు కాగా.. అత్యధికంగా రెవెన్యూ శాఖకు 246 అర్జీలు వచ్చాయి. పంచాయతీ రాజ్, పోలీస్, సర్వే, విద్యుత్, గ్రామీణ మంచినీటి సరఫరా, వాటర్ రిసోర్స్, గ్రామీణ అభివృద్ధి, మున్సిపాలిటీ, హౌసింగ్, మొత్తం 40 శాఖల్లో అర్జీలు స్వీకరించారు.

**అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి**

తుమ్మపాల: రోలుగుంట మండలం శరభవరం పంచాయతీ పరిధిలోని రాజన్నపేట గ్రామంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా క్వారీ యజమానులు పట్టించుకోవడం లేదని చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పీఎస్ఎన్ రాజు ఆరోపించారు. ఈ మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఆయన మళ్లీ ఫిర్యాదు చేశారు. క్వారీ నిర్వాహకులు అనుమతులు తీసుకోకుండా నీటిపారుదల ట్యాంకు మీదుగా రహదారిని నిర్మించి రైతుల వ్యవసాయ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. క్వారీ చుట్టూ ఉన్న సమీప గృహాలు, సాగు భూములకు తీవ్రనష్టం వాటిల్లుతోందన్నారు. వడ్డిప, బుచ్చయ్యపేట గ్రామాల్లో రోడ్లు బాగా దెబ్బతిన్నాయని, క్వారీ లీజుదారులు చేసిన అక్రమాలపై మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయత్ రాజ్ శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు.

## ఎస్పీ కార్యాలయానికి 42 అర్జీలు



ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదును స్వీకరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

**అనకాపల్లి:** ఎస్పీ కార్యాలయంలో సోమవారం పీఆర్‌జీఎస్‌కు 42 అర్జీలు అందాయి. అర్జీదారుల నుంచి ఎస్పీ తుహిన్ సిన్హా ఫిర్యాదులు స్వీకరించారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్ఐ డి.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

– విజయవాడ సచివాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని కోటవురట్ల మండలం అన్నవరానికి చెందిన నక్కా మాణిక్యాలరావు మోసం చేసినట్టు అదే మండలం ఎండపల్లికి చెందిన గుడివాడ వరలక్ష్మి, లింగాపల్లికి చెందిన గెడ్డమూరి వెంకటరావు, టెకు కుమార్ అనే దివ్యాంగులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నాగమణి రూ.10.50లక్షలు, టేకు కుమార్ నుంచి రూ.3 లక్షలు, గెడ్డమూర్తి వెంకటరావు నుంచి రూ.4లక్షలు 2021 ఏడాదిలో దఫదఫాలుగా చెల్లించామని వాపోయారు. కనీసం తమ నగదును తిరిగి ఇప్పించాలని బాధితులు వేడుకున్నారు. ఈ విషయంపై ఎస్పీ కోటవురట్ల సీఐతో ఫోన్‌లో మాట్లాడి నక్కా మాణిక్యాలరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### కుమారుడి చిత్రహింసల నుంచి రక్షించండి



కుమారుడి చిత్రహింసల నుంచి రక్షించి, కన్న బిడ్డలకు భూములను సమానంగా పంచాలంటూ కె.కోటపాడు మండలం కింతాడ శివారు బత్తివానిపాలెం గ్రామానికి చెందిన కర్రి రాములమ్మ తన కుమార్తె వెంకటలక్ష్మితో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భర్త ద్వారా వచ్చిన భూములు, ఇంటిని తనకు తెలియకుండా పెద్ద కుమారుడు కర్రి గోవిందు తన పేరున నమోదు చేయించుకుని చిత్రహింసలకు గురిచేస్తున్నాడని ఆమె కన్నీటి పర్యంతమైంది.

– కర్రి రాములమ్మ, కుమార్తె వెంకటలక్ష్మి

### వైఎస్సార్‌సీపీ సర్పంచ్ తమ్ముడి పింఛన్ కట్



సర్పంచ్‌గా ఉన్న తన అన్న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కావడంతో తన పింఛన్ తొలగించారని రావికమతం మండలం చినపాసిలి గ్రామానికి చెందిన వృద్ధ వికలాంగుడు కోమర దుర్గునాయుడు ఫిర్యాదు చేశారు. కారణం లేకుండా జనవరి నెల నుంచి పింఛన్ నిలిపివేశారని, కలెక్టర్ స్పందించి తన పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరారు. వృద్ధురాలైన భార్యతో కలిసి పింఛనే ఆధారంగా జీవించే తమ పొట్ట కొట్టొదని ఆయన వేడుకున్నారు. గుండె జబ్బుతో ఉన్న తాను పింఛన్ సొమ్ముతోనే ప్రతి నెలా విశాఖపట్నం వెళ్లి మందులు తెచ్చుకుంటున్నానని వాపోయారు.

– కోమర దుర్గునాయుడు

### డోలీతో నిరసన తెలిపాడని పింఛన్ నిలిపివేత



ప్రభుత్వానికి వ్యతిరేకంగా డోలీ మోసి నిరసన తెలిపాడని నెపంతో అధికారులు పింఛన్ తొలగించారని రోలుగుంట మండలం ఎం.కె.పట్నం ప్రాంతానికి చెందిన గిరిజన వికలాంగుడు గెమ్మిలి ఆనంద్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పింఛన్ ఆధారంగా నలుగురు పిల్లలను పోషించుకుంటూ జీవిస్తున్న తనకు అన్యాయం చేయొద్దని వేడుకున్నాడు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి పింఛన్ పునరుద్ధరించాలని కోరారు.

– గెమ్మిలి ఆనంద్

### 250 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలి



250 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురై ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోతుంటే అధికారులు కనీసం పట్టించుకోవడం లేదంటూ ఎస్.రాయవరం వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలో పెద్ద ఉప్పలం, చిన ఉప్పలం రెవెన్యూ గ్రామాల్లో ఆక్రమణకు గురవుతున్న వందల ఎకరాల ప్రభుత్వ భూమి వివరాలను సర్వే నంబర్లతో సహా ఫిర్యాదులో పేర్కొన్నారు.

–చోడిపల్లి అప్పలరాజు

# నిలిచిపోయిన 'ఆరోగ్యశ్రీ' సేవలు

- ఆస్పత్రుల్లో అడ్మిషన్ల బంద్
- బకాయిలు చెల్లించని ప్రభుత్వం

**మహారాణిపేట (విశాఖ):** పేదల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది. ఆరోగ్యశ్రీ(ఎన్టీఆర్ వైద్యసేవ)పై మొదటి నుంచి కూటమి సర్కార్ సవతి తల్లి ప్రేమను చూపిస్తోంది. ఎన్నికలకు ముందు అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం .. ఇప్పుడు హామీలు అమలు చేయకపోగా.. ఉన్న వాటికి తిలోదకాలు పలుకుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ప్రైవేటు ఆస్పత్రులకు ఇవ్వాల్సిన ఆరోగ్య శ్రీ నిధులు సుమారు రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్య సేవలను నిలిపివేశాయి. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వైద్యానికి వెళ్లే ఆర్థిక స్థోమత లేక అనారోగ్యంతోనే కాలాన్ని వెళ్లబుచ్చుతున్నారు.

**పేదలపై కూటమి కత్తి**

అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదలపై కత్తి కట్టింది. సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికలకు ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తేసే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారించడం.. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపి రాష్ట్ర ఖజానాను నింపుకుంటున్న కూటమి ప్రభుత్వం.. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఆలోచనతో 2007, ఏప్రిల్ 1న పురుడు పోసుకొని లక్షల మంది పేదల ఆరోగ్యాలను నిలబెడుతున్న ఆరోగ్య శ్రీ పథకంపైనే కాకుండా ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌పై కూడా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు అందుతున్న ఆరోగ్య శ్రీ సేవలతో పాటు ఉద్యోగ ఆరోగ్య పథకానికి కూడా సోమవారం కొంత వరకు బ్రేకు పడింది.

**ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకపోవడంతో..**

జిల్లాలో 102 ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ పరిధిలో ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో కొత్త రోగులను ఎవరినీ అడ్మిట్ చేసుకోలేదు. ఆరోగ్య శ్రీ కార్డులు ఉన్న పేదలు ఈ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందుతున్నారు. అయితే ఈ చికిత్సలకు సంబంధించి ప్రభుత్వం ఆయా ఆస్పత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో సోమవారం నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీలో పలు సేవలను నిలిపివేశారు. సోమవారం పలు ఆస్పత్రుల్లో కొత్తగా వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించారు కానీ ఆస్పత్రుల్లో అడ్మిట్ చేసుకోలేదు. ఇలాంటి ఆస్పత్రులను విశాఖలో దాదాపు 27 వరకు గుర్తించారు. బకాయిల విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ రాకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు నిలుపుదల చేశాయి. దీంతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదలకు వైద్యం అందకుండా పోయింది. ప్రభుత్వం నుంచి బిల్లులు వస్తేనే గానీ ప్రైవేటు ఆస్పత్రులు వైద్యం అందించడానికి సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. పేదలు, ప్రభుత్వ ఉద్యోగులకు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. 10 నెలల్లోనే విశ్వరూపాన్ని చూపిస్తోంది.

# విపత్తులను ఎదుర్కొనేందుకు మాక్ డ్రిల్స్

- 26న అనకాపల్లిలో..

**సాక్షి, అమరావతి** నైరుతి రుతుపవనాల సీజన్‌లో తుఫాను, వరదలు, భారీవర్షాలు వంటి విపత్తులు సంభవిస్తే ఎదుర్కోడానికి విపత్తుల నిర్వహణ సంస్థ సన్నద్ధమవుతుందని ఆ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. తుపాను, వరదల సమయంలో ఎలాంటి ప్రమాదం ఎదురవుతుంది, ఆ సమయంలో దాని నుంచి తప్పించుకోవడానికి ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రక్షక దళాలకు ఎలా సహకరించాలి, అధికారులు తక్షణం ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే దానిపై మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో తుఫాను, వరదలకు ప్రభావితమయ్యే 17 జిల్లాల్లోని నదీ, తీరప్రాంతాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కృష్ణా, పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 11న, కోనసీమ 12న, విజయనగరం 16న, తూర్పుగోదావరి 22న, నెల్లూరు 24న, అనకాపల్లి 26న, పల్నాడు 29న, పార్వతీపురం మన్యం మే 2న, తిరుపతి మే 6న, బాపట్ల జిల్లాలో మే 9న మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామన్నారు. ప్రకృతి విపత్తుల పట్ల అవగాహన కలిగి ఉండటం వలన ఆస్తి, ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. మాక్ డ్రిల్స్‌లో విపత్తుకి ముందు, విపత్తు సమయంలో, ఆ తర్వాత ఎలా వ్యవహరించాలనే అంశాలపై ప్రజలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఫైర్, పోలీసు సిబ్బంది వివిధ రెస్క్యూ పరికరాలతో అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. శిథిలావస్థ భవనాల్లోని ప్రజలను రక్షించడం, కొమ్మలు తొలగించి రోడ్డుకు సౌకర్యం కలిగించడం, వరద ప్రవాహం ఉన్నప్పుడు అందుబాటులో ఉన్న వస్తువులు/తాడు సహాయంతో సురక్షిత ప్రాంతానికి వెళ్లడం, భయాందోళనలకు గురికాకుండా ప్రథమ చికిత్స చేయడం, మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్ లో తరలించడం వంటి ఉపాయాలను(టెక్నిక్స్) ప్రజలకు తెలుపుతామన్నారు.

## విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్ట్

**కశింకోట:** మండలంలోని నరసింగబిల్లిలో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ పి.మనోజ్‌కుమార్ తెలిపారు. నరసింగబిల్లిలోని జంగాల కాలనీకి చెందిన పిల్లిబోయిన బ్యూల(15) ఈ నెల 4న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పక్క ఇంట్లో ఉంటున్న పెయింటర్ ఒమ్మి జయకృష్ణ అలియాస్ నాని ప్రేమిస్తున్నానని తరచుగా వేధిస్తుండడంతో బాలిక మనస్తాపం చెంది ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ మేరకు ఆమె తండ్రి వరహాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రెండు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

## లారీ డ్రైవర్ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**కశింకోట:** ఉగ్గినపాలెం వద్ద లారీ డ్రైవర్ హత్య కేసులో నిందితుడు కంటైనర్ లారీ డ్రైవర్‌కు జీవిత కాల కారాగార శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ అనకాపల్లి 10వ అదనపు జిల్లా కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం విలేకరులకు వివరించారు. ఉగ్గినపాలెం వద్ద ఉన్న కాశీ ప్రసాద్ పెట్రోల్ బంకు వద్దకు 2018 జూన్ 8న తమిళనాడులోని వెల్లూరు జిల్లాలోని వినాయకపురానికి చెందిన లారీ డ్రైవర్ కన్నన్ మునిరాజు(45), అదే రాష్ట్రం మధురై జిల్లా విలన్ గుడికి చెందిన కంటైనర్ లారీ డ్రైవర్ శర్వణ్‌కుమార్(43) కంటైనర్‌లో చేరుకున్నారు. అక్కడ మధ్యాహ్న భోజనం అనంతరం ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో అక్కడి లారీ డ్రైవర్లు సర్ది చెప్పి విడిపించారు. తరువాత మునిరాజు పెట్రోల్ బంక్ సమీపంలోని గుట్టపై విశ్రమిస్తుండగా అతనిపై ఆవేశంతో శర్వణ్‌కుమార్ కాంక్రీట్ రాయితో దాడి చేశాడు. గాయపడిన ఆయనను స్థానికులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మునిరాజు మృతి చెందాడు. ఈ విషయమై కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ జి. రామచంద్రరావు కేసు దర్యాప్తు చేసి అభియోగ పత్రాలను దాఖలు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ నందనవనం శ్రీవిద్య నిందితునికి జీవితకాలం కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అప్పటి దర్యాప్తు అధికారి రూరల్ సీఐ రామచంద్రరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది, కోర్టు మానిటరింగ్ విభాగం సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## అది హత్య కాదు..ఆత్మహత్యే..

**కశింకోట:** నరసింగబిల్లిలో పిల్లిబోయిన బ్యూల (15)ది హత్య కాదని, ఆత్మహత్య అని ఎస్ఐ మనోజ్‌కుమార్ అన్నారు. పోస్టుమార్టం నివేదికలో ఆత్మహత్యగా రిపోర్టు వచ్చిందన్నారు. దీన్ని హత్యగా ఐద్వా ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు.

# ముగ్గురు బైకు దొంగల అరెస్టు

- 9 బైక్‌లు స్వాధీనం



**బుచ్చెయ్యపేట :** మండలంలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 9 బైక్‌లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ శ్రావణి తెలిపారు. సోమవారం బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్ వద్ద బైక్‌లను, దొంగతనానికి పాల్పడిన యువకుల వివరాలను ఎస్ఐ శ్రీనివాసరావుతో కలిసి ఆమె వెల్లడించారు. పోలీసులు సాధారణ వాహనాల రికార్డుల తనిఖీల్లో భాగంగా విజయరామరాజుపేట గ్రామానికి చెందిన యువకుడిని పట్టుకుని ఆరా తీయగా రికార్డులు లేకపోవడంతో బైక్ దొంగిలించినట్టుగా గుర్తించామన్నారు. యువకుడిని విచారణ చేయగా ఇతనితో పాటు ఇదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు యువకులు కలిసి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్టు వెల్లడించారన్నారు. బుచ్చెయ్యపేట, చోడవరం, అనకాపల్లి టౌన్, కంచరపాలెం, దువ్వాడ, విశాఖ ప్రాంతాల్లో బైక్‌లు దొంగతనం చేసినట్టు ముగ్గురూ ఒప్పుకున్నారన్నారు. వీరు దొంగతనం చేసిన 9 బైక్‌లను స్వాధీనం చేసుకుని వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

# రైతు బేజార్

రైతు బజారు లేక ఇక్కట్లు

రోడ్లపై కూరగాయల విక్రయాలు

శీతల గిడ్డంగి లేక దళారుల పాలు

నష్టపోతున్న అన్నదాతలు


గవరపాలెంలో మూతబడిన రైతుబజార్

అనకాపల్లి టౌన్: దైనందిన జీవితంలో సామాన్యుడికి అవసరమైనవి నిత్యావసరాలు. ప్రతీ నిమషం వాటి కోసం పరుగులు పెడుతూనే ఉంటాడు. బియ్యం నుంచి కూరగాయల వరకు ప్రతిదీ అవసరమే. ప్రధానంగా కాయగూరలు, ఆకుకూరలు వంటివి అత్యవసరం. వీటి కోసం ఎక్కువగా సామాన్యులు ఆధార పడేది రైతు బజార్ల మీదే. ఓపెన్ మార్కెట్లతో పోలిస్తే రైతుబజార్లలో ఎక్కువగా కూరగాయలను కొనడానికి ఇష్టపడుతుంటారు. తాజా కాయగూరలు రైతుల నుంచే నేరుగా వస్తుంటాయి. రేట్లు కూడా తక్కువ. వినియోగదారులు, రైతులు ఇద్దరు లబ్ధి పొందేలా మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. బహిరంగ మార్కెట్లో ఎక్కువ ధరలు పెరిగినా రైతు బజార్లో మాత్రం అందుబాటులో ధరలు ఉండేలా చూస్తారు. కొన్ని సందర్భాలలో పప్పులు కూడా సబ్సిడీపై విక్రయిస్తుంటారు. దీంతో వినియోగదారులు వీటిపైనే ఎక్కువగా ఆసక్తి చూపుతుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రైతుబజార్లు పట్టణంలో ఎక్కడా లేవు.

**పట్టణంలో ఒక్క రైతు బజారూ లేదు..**

జిల్లాగా రూపాంతరం చెందినా రైతుబజార్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టలేదు. రోడ్లపైనే రైతులు తాము పండించే ఉత్పత్తులను అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధానంగా గాంధీ మార్కెట్‌కు రైతులు అధికంగా వస్తుంటారు. ఇక్కడి వచ్చిందే తరువాయి దళారులు చేరి తక్కువ ధరకు కొనుగోలు చేస్తుంటారు. చేసేది లేక ఏదో ఒక ధరకు అమ్మేస్తుంటారు. ఎంతో కష్టపడి పండించిన రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకొనే వీలు కూడా లేదు. రైతులు తెచ్చిన ఉత్పత్తులు మరుసటి రోజు కూడా అమ్మే వీలులేదు. అదే శీతల గిడ్డంగి ఉంటే రైతులు రోజుల తరబడి తమ ఉత్పత్తులను దాచుకొని అమ్ముకొనే వీలు ఉంటుంది. 2009లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో లక్షలాది రూపాయలతో గవరపాలెంలో రైతుబజార్ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. ఇప్పుడు అది మూతపడి ఉంది. ఈ రైతుబజార్ గవరపాలెం వాసులకు ఎంతో ఉపయోగపడేది. దీన్ని పునః ప్రారంభించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.


గాంధీ మార్కెట్‌లో టమాటాలను విక్రయిస్తున్న రైతు


రోడ్లపైనే కాయగూరలు విక్రయిస్తున్న రైతులు

## రైతు బజార్ ఏర్పాటు చేయాలి



రైతుబజార్ లేక అధిక ధరలకు కాయగూరలను కొనాల్సి వస్తోంది. రిటైల్ మార్కెట్‌లో వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి అమ్ముతున్నారు. పట్టణంలో తక్షణమే రైతు బజార్ ఏర్పాటు చేయాలి.

– అప్పలరాజు, అనకాపల్లి

## శీతల గిడ్డంగి లేక నష్టపోతున్నాం



శీతల గిడ్డంగి లేక ఏ రోజు తీసుకొచ్చిన కూరగాయలు అదే రోజు ఎంతో కొంతకు అమ్మాల్సి వస్తోంది. కొనుగోలుదారులు రాలేనప్పుడు దళారులకు తక్కువ ధరకు తెగ నమ్ముకుంటున్నాం.

– పి. వెంకట రాజేశ్వరి, వల్లూరు

## రైతుబజార్ ఏర్పాటుకు స్థల అన్వేషణ

పట్టణంలో రైతుబజార్ ఏర్పాటుకు స్థల అన్వేషణ చేస్తున్నాం. ఇటీవల కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి రింగ్‌రోడ్ మార్కెట్ యార్డు స్థలాన్ని పరిశీలించాం. గవరపాలెంలో రైతుబజార్ జీవీఎంసీ జోన్ పరిధిలో ఉంది. దానిని ఏర్పాటు చేయాలంటే జీవీఎంసీ వారు నిర్ణయం తీసుకోవాలి.

– బి. రవికుమార్, జిల్లా అగ్రి మార్కెటింగ్ ఆఫీసర్

## పెంచిన గ్యాస్ ధర ఉపసంహరించుకోవాలి

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో అధిక ధరలతో సామాన్యుల నడ్డివిరుస్తూ కొత్తగా గ్యాస్ సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై 2 శాతం ఎక్సైజ్ సుంకాన్ని పెంచడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇచ్చే సిలిండర్ల ధరలను పెంచిన కేంద్ర ప్రభుత్వంపై త్వరలో ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరల పెరుగుదలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం మోపడం అన్యాయమన్నారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని కోరారు. మోదీ అధికారంలోకి రాకముందు గ్యాస్ సిలిండర్ ధర రూ.450 ఉంటే, ప్రస్తుతం ధర రూ.850 పెరిగిందని, మరలా మరో రూ.50 పెంచడం ప్రజలపై అధిక బారం మోపడమేనన్నారు. గతంలో లీటరు పెట్రోల్ రూ. 63 ఉండగా, ప్రస్తుతం రూ.110 ఉందని విమర్శించారు.

## వాహన పార్కింగ్.. మా ఇష్టం


రోడ్డు మధ్యలో ఉంచిన వాహనాలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని మిరియాల కాలనీ రెండో వీధిలో రోడ్డు మధ్యలో కొంతమంది వ్యక్తులు ద్విచక్ర వాహనాలు పెడుతున్నారు. కనీసం ఇంటి నుంచి బయటకు వెళ్లడానికి వీలు లేకుండా ద్విచక్రవాహనాలు పెడుతున్నారని కాలనీకి చెందిన నర్సింహరాజు, తదితరులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## క్లుప్తంగా

### లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం నేడు


కశింకోటలో వెలసిన లక్ష్మీనృసింహస్వామి

కశింకోట: స్థానిక పురాతన లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఏటా చైత్ర శుద్ధ ఏకాదశి రోజు కల్యాణాన్ని జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. లక్ష్మీనృసింహస్వామి, లక్ష్మీదేవిల ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రాల నడుమ కల్యాణం జరిపిస్తారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, పూలతో స్వామివార్ల అలంకరణ జరుగుతుందని ఆలయ అర్చకుడు అత్తిలి సత్య వెంకట కేశవ కోదండపాణి తెలిపారు. 13న రాత్రి 7 గంటలకు పుష్పాంజలి కార్యక్రమం ఆలయంలో జరగనుందన్నారు.

### మలసాల భరత్‌కుమార్ పరామర్శ


కరణం శివను పరామర్శిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోమవారం పరామర్శించారు. మార్టూరు గ్రామంలో కరణం శివ తల్లి, కశింకోట మండలం విసన్నపేట గ్రామం సర్పంచ్ ఉప్పునూరు అప్పారావు చెల్లెలు తురుబిల్లి నాగమణి, కొత్తపల్లి గ్రామంలో శనివాడ బాబూరావు ఇటీవల మృతి చెందారు. చింతలపాలెంలో కొట్టే సత్తిబాబుకు చెందిన ఆవులు చనిపోయాయి. ఈ మేరకు ఆయా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిశోర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, కొత్తపల్లి సర్పంచ్ శ్యామ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్య తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

## బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 3,987 దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్టధర | గరిష్టధర |
|---|---|---|
| మొదటి రకం | 3,580 | 4.200 |
| రెండో రకం | 3,100 | 3,780 |
| మూడో రకం | 2,890 | 3,090 |

## అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రాజా | :మాడ్ స్క్వేర్ |
| సత్యనారాయణ స్క్రీన్-1 | : రాబిన్‌హుడ్ |
| సత్యనారాయణ స్క్రీన్-2 | :రాజుగారి దొంగలు |
| పర్తిసాయి | :కోర్టు |
| షిర్డీసాయి | :లైఫ్ |
| వెంకటేశ్వర | :ఆదిత్య 369 |
| శ్రీసత్య | :సంక్రాంతికి వస్తున్నాం. |
| రామచంద్ర | :వీరధీరశూర |

## రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 25 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

## గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 415 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 361 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

## పరిశుభ్రమైన ఆహారంతో ఆరోగ్యం


ఆస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


తాళ్లపాలెం పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ప్రదర్శన

అనకాపల్లి: వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యం అందించినట్లయితే ఆరోగ్యంగా జీవించవచ్చని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి విజయకుమార్ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో తుమ్మపాల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. మాతా శిశు సంరక్షణ, పిల్లలకు సకాలంలో వేయవలసిన వ్యాధి నిరోధక టీకాలపై ఆశవర్కర్లు గ్రామాల్లో దృష్టి సారించాలన్నారు. వేసవిలో చిన్నారులు, వృద్ధులు వడదెబ్బ బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులకు కేంద్ర ప్రభుత్వం కిల్కరి యాప్‌ను ప్రవేశపెట్టిందని, వారి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తుమ్మపాల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ మంగమ్మ, సూపర్‌వైజర్స్ ఆర్.సంఘం, మరియమ్మ, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎ. మనీషా మాట్లాడుతూ మాతా శిశు మరణాలు అరికట్టడానికి అంతా కృషి చేద్దామన్నారు. ఆరోగ్యానికి, ఆశా జనకమైన భవిష్యత్‌కు దోహదపడదామన్నారు. ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి. ప్రసాద్ మాట్లాడుతూ ప్రసవ సమయాల్లో మాతా శిశు మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిని 2030కి అరికట్టడానికి కృషి జరుగుతుందన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎ.వి. సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలు ఉచిత ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎన్ఎంలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేడు ఉపమాకలో శివపార్వతుల కల్యాణం

### 12వ తేదీ వరకు ఉత్సవాలు


ఉపమాకలో శివాలయం

నక్కపల్లి: ప్రముఖ పురాతన శివాలయం ఉపమాకలో భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఆలయంలో గణపతి పూజ, శుద్ధి పుణ్యాహవచనం, అంకురార్పణ, రాత్రి 6.30 నుంచి సప్పరం వాహనంలో పరమేశ్వరుడ్ని పల్లకిలో పార్వతి దేవిని ఉంచి ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. మైలవరభట్ల జోగారావు ఇంటి వద్ద ఎదురు సన్నాహ మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ పెళ్లిమాటల తంతును వేదపండితురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవి వ్యాఖ్యానంలో జరుగుతుందన్నారు. పెళ్లి కుమారుడు తరపున నక్కపల్లికి చెందిన శింగంశెట్టి వారి కుటుంబీకులు, పెళ్లి కుమార్తె తరపున ఎం.వి.వి.ఎస్ మూర్తి (సహారా పంతులు) వారి కుటుంబ సభ్యులతో నిర్వహిస్తామన్నారు. అనంతరం శింగంశెట్టి కుటుంబీకులతో ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. రాత్రి 8.30 నుంచి 10.30 గంటల వరకు స్వామివారి ఆలయంలో తాత్కాలిక కల్యాణ వేదిక వద్ద శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. 9వ తేదీన కుంకుమ పూజ, 10న సదస్యం, 11న తోట ఉత్సవం, 12న పూర్ణాహుతి స్వామివారి పుష్పయాగోత్సవం, పవళింపు సేవ జరుగుతాయన్నారు.

## విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు


ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ నోడల్ అధికారి డాక్టర్ విశ్వనాథ్, సిబ్బంది

సబ్బవరం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఫ్లోరోసిస్ వైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. జిల్లా ఫ్లోరోసిస్ నోడల్ అధికారి డాక్టర్ ఎ.విశ్వనాథ్ ఆధ్వర్యంలోని వైద్య బృందం ఈ పరీక్షలను జరిపింది. విద్యార్థులకు ఫ్లోరోసిస్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫ్లోరోసిస్ సర్వేకు అనుబంధంగా కమ్యూనిటీ సర్వేలో భాగంగా గృహాలను సందర్శించి, వారి వివరాలను సేకరించి పరీక్షలు, స్క్రీనింగ్ జరిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.శ్రీనివాస్, సీహెచ్‌వో స్వర్ణలత, పీహెచ్ ఎన్ రత్నబాయి, ఆరోగ్య సూపర్‌వైజర్లు రాంబాబు, చిన్నతల్లి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## గండిపేట వీఎస్ఎస్‌లో అవకతవకలపై ఫిర్యాదు

మాకవరపాలెం: గండిపేట వీఎస్ఎస్‌లో జరిగి న అవకతవకలపై విచారణకు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిషోర్ తెలిపారు. అనకాపల్లి సెక్షన్ పరిధిలోని గండిపేట వీఎస్ఎస్ ద్వారా వచ్చే ఆదాయం ఏం చేస్తున్నారో తెలి యడం లేదని, దీనిపై విచారణ చేయాలని సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో ఫిర్యాదు చేశామన్నారు. గత మూడేళ్లుగా గండిపేట వీఎస్ఎస్ ద్వారా ఏటా రూ. లక్షల్లో ఆదాయం వస్తోందన్నారు. అయితే ఈ ఆదా యం ఏం చేస్తున్నారో, ఎవరి అకౌంట్‌లో వేస్తున్నారో సభ్యులకు తెలియడం లేదన్నారు. 50 ఎకరాల్లో యూకలిప్టస్ కలప అమ్మకాలు చేశార ని, ఈ నగదు సైతం పక్కదారి పట్టిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలలో డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవని, ఈ వీఎస్ఎస్‌పై పూర్తి స్థాయి విచారణ చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పక్కదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## 20 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి: మండలంలో పాపయ్య సంతపాలెం శివారులో 20 మద్యం క్వాటర్ బాటిళ్లతో అదే గ్రామానికి చెందిన కె.వెంకటరమణ పట్టుబడినట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ సోమవారం తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఇంటర్ విద్యార్థినులకు నోటు పుస్తకాల పంపిణీ


విద్యార్థినులకు పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం, లెక్చరర్లు

యలమంచిలి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన నోటు పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్‌లో చదువుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయిని వీవీ హిమబిందు, స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యుడు ఆడారి ఆదిమూర్తి, అధ్యాపకులు ఒక్కో విద్యార్థికి 12 నోటు పుస్తకాలు చొప్పున పంపిణీ చేశారు. త్వరలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తామని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో పద్మకుమార్, మువ్వల రాంబాబు, సత్యనారాయణ, పద్మాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల చెంతకు బాలిక


మైనర్ బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది గ్రామంలో తప్పిపోయిన బాలికను ఎట్టకేలకు ఆమె తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. గత నెల 15న వడ్డాది గ్రామానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముత్యాల శాంతి(17) ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆమె తల్లిదండ్రులు 18న ఫిర్యాదు చేయడంతో తమ సిబ్బందితో దర్యాప్తు చేశామని ఎస్ఐ తెలిపారు. బాలిక ఆచూకీ విజయవాడలో లభ్యం కావడంతో బుచ్చెయ్యపేట తీసికొచ్చి సోమవారం ఆమె తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

## జాబ్‌మేళాలో 17 మంది ఎంపిక


పలు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు, కళాశాల సిబ్బంది

సబ్బవరం: విశాఖలోని మద్దిలపాలెం వీఎస్ కృష్ణ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 17 మంది పలు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ విజయవాడ వారి ఆదేశాల మేరకు ఈ నెల 4న నిర్వహించిన జాబ్ మేళాలో కళాశాల నుంచి 72 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఫార్మా, ఐటీతో పాటు పలు మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలలో ఈ ఉద్యోగాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు జేకేసీ కోఆర్డినేటర్ బి శంకర్, అధ్యాపకులు అభినందించారు.

## వెలవెలబోయిన వారపు సంత


ఎండ తీవ్రతకు వెలవెలబోతున్న తాళ్లపాలెం వారపు సంత

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంత సోమవారం వేసవి ఎండకు వెలవెలబోయింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కూరగాయలు, ఇతర సరుకులు కొనుగోలు చేయడానికి వెనుకడుగు వేశారు. దీంతో అడపాదడపా అమ్మకాలు సాగాయి. బేరాలు లేక వ్యాపారులు డీలా పడిపోయారు. 3 గంటల తర్వాత వాతావరణం చల్లబడటంతో అమ్మకాలు సాగడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. వారపు సంతలో కూరగాయల ధరలు స్థిరంగా ఉన్నాయి. కిలో టమాటా రూ.20, ఉల్లి, బంగాళదుంప రూ.30, దొండకాయ రూ.40, బెండకాయ, చామదుంపలు, క్యారెట్, బీట్రూట్ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

## బాధితుల ఖాతాల్లోనే నగదు జమ చేయాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారంగా అకౌంట్‌లో నగదు జమ చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని నాగులాపల్లి సచివాలయంలో రోడ్డు విస్తరణ బాధితులతో సోమవారం ఆర్డీవో అయిషా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి విస్తరణకు రైతులంతా ముందుకు వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. గతంలో నిర్వహించిన గ్రామసభల్లో ప్రకటించినట్లు పరిహారం తప్పకుండా బ్యాంక్ ఖాతాలో జమ చేయాల్సిందేనన్నారు. అంతేగాని టీడీఆర్ బాండ్లు ఇస్తామంటే ఒప్పుకునేది లేదన్నారు. రహదారి విస్తరణకు తామంతా అనుకూలమని, పరిహారం విషయంలో టీడీఆర్ బాండ్లు కాకుండా నేరుగా అకౌంట్‌లో నగదు జమ చేయాలన్నారు. నిర్వాసితులంతా ఒకేమాట ఒకేబాటగా ఉన్నామన్నారు. తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, వీఎంఆర్‌డీఏ అధికారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వేతనదారుల పోరాటంతో దక్కిన ‘ఉపాధి’


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం రూరల్: తిమ్మరాజుపేటలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని గ్రామ సచివాలయం, ఎంపీడీవో, ఏపీవో కార్యాలయాల ఎదుట పలు దఫాలుగా చేసిన ఆందోళనకు ఫలితం దక్కిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము తెలిపారు. ఈ నెల ఆరంభం నుంచి ఉపాధి పనులు ప్రారంభమయ్యాయన్నారు. గ్రామీణ ప్రజలకు 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.6 వందల కూలి ఇవ్వాలన్నారు. వేసవి ఎండ తీవ్రతకు అనుగుణంగా కూలీలకు టెంట్లు, నీరు వంటి సౌకర్యాలు కల్పించి 15 రోజులకు ఒకసారి కూలి నగదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శరగడం రామనాయుడు, నడుపూరు సన్యాశిరావు, చెల్లుబోయిన అప్పారావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.